ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 52 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
గురువారం 26 సెప్టెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## పుణెలో భారీ వర్షాలు.. మోదీ పర్యటన రద్దు

### భారీ వర్షాల కారణంగా ప్రధాని మోదీ పుణె పర్యటన రద్దయ్యింది.



ముంబయి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో ముంబయి సహా పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. శుక్రవారం వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ పుణె పర్యటన రద్దయ్యింది. షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం మోదీ పుణె చేరుకోవాల్సి ఉంది. రూ.20వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాల్సిఉంది. వర్షాల రాకను పక్కాగా చెప్పే రెండు సూపర్ కంప్యూటర్లను కూడా ప్రారంభించాల్సింది. మరికొద్ది నెలల్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జరగనున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, వర్షాల కారణంగా పర్యటనను రద్దు చేస్తున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయ అధికారులు వెల్లడించారు. ముంబయి సహా ఠాణె, రాస్గఢ్, పుణె తదితర ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పుణెలోని స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. ముంబయిలోనూ నేడు విద్యాసంస్థలు తెరుచుకోలేదు.

## మైక్ తోసేసి, విలేకరులపై సీఎం అసహనం

### ముడా స్కామ్లో ఆరోపణలు ఎదుర్కొంటోన్న సీఎం సిద్ధరామయ్య పాత్రికేయులపై అసహనం వ్యక్తంచేశారు.



బెంగళూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: కర్ణాటక రాజకీయాల్లో కలకలం సృష్టిస్తోన్న ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ) స్కామ్తో సీఎం సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ కుంభకోణం సమగ్ర దర్యాప్తులో భాగంగా సిద్ధూను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడం చట్టబద్ధమేనని ఇటీవలే హైకోర్టు తీర్పునిచ్చింది. ఆ తర్వాత కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన రాజీనామా చేయాలని భాజపా, జేడీఎస్ డిమాండ్ చేస్తూ.. నిరసనలు తెలుపుతున్నాయి. దీనిపై స్పందించాలని సీఎంను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దాంతో సహనం కోల్పోయిన ఆయన, మైక్ను పక్కకు తోసేశారు. "అవసరమైతే నేనే పిలిచి మాట్లాడుతాగా" అంటూ కాస్త సీరియస్గా మాట్లాడారు. 'ముడా' స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె. అబ్రహం గవర్నర్కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్ కుమార్ ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుల మేరకు ఆగస్టు 16న సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించగా.. దానిని గవర్నర్ తోసిపుచ్చారు. దాంతో సీఎం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఇదిలాఉంటే.. ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కొనడం తప్పనిసరని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర జోస్యం చెప్పారు. ఆయన ఎంత మొండిగా వ్యవహరించినా, పీఠాన్ని వీడవలసిందేనని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. మరోవైపు తాను విచారణకు భయపడటం లేదని సీఎం అన్నారు.

## పరువు నష్టం కేసు.. ఎంపీ సంజరూత్కు 15 రోజులు జైలు

ముంబయి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: పరువు నష్టం కేసులో శివసేన-యూబీటీ కీలక నేత సంజయ్రౌత్కు ఎదురుదెబ్బ తగిలింది. భాజపా నేత కిరీట్ సోమయ్య భార్య మేధ సోమయ్య దాఖలు చేసిన పరువునష్టం కేసులో ఆయనకు 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ ముంబయి కోర్టు తీర్పు వెలువరించింది. మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 500 కింద రౌత్ను దోషిగా నిర్ధరించింది. ఆయనకు రూ.25 వేలు జరిమానాతో పాటు 15 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. మహారాష్ట్ర భాజపా నేత కిరీట్ సోమయ్య కుటుంబసభ్యులు ఓ స్వచ్ఛందసంస్థను నడుపుతున్నారు. మీరా భయందర్ మున్సిపల్ కార్పొరేషన్లో రూ.100 కోట్ల టాయిలెట్ స్కామ్ జరిగిందని శివసేన యూబీటీ నేత సంజయ్రౌత్ ఆరోపించారు. ఇక, ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పలు మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే, వీటిని ఖండించిన కిరీట్ సోమయ్య సతీమణి మేధ ఎటువంటి ఆధారాలు లేకుండా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు.



## ఆ మాటలు విని షాక్ అయ్యా: కేజ్రీవాల్

### భాజపా నేత ఒకరు చెప్పిన మాటలు విని తాను షాక్కు గురయ్యాయని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.



ఢిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని, ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యారు ఆన్ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్. కొన్నిరోజుల క్రితం సీఎం పీఠాన్ని వదులుకున్న ఆయన తాజాగా భాజపాపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేత ఒకరు చెప్పిన మాటలు తనను షాక్ గురిచేశాయని అన్నారు. "నా అరెస్టు వల్ల ఏం లాభం దక్కిందని.. ఇటీవల నేను భాజపాకు చెందిన సీనియర్ నేతను అడిగాను. ఆయన చెప్పిన మాటలు విని నేను షాక్ అయ్యా. ఢిల్లీలో పాలన పట్టాలు తప్పిందని, పనులు ఆగిపోయాయని ఆ నేత బదులిచ్చారు. ఢిల్లీలో పనులు ఆగిపోయేలా చేసి, పాలన పట్టాలు తప్పేలా చేసి, ప్రజలకు అసౌకర్యం కలిగించడమే వారి ఉద్దేశమా? ఢిల్లీ ప్రజలారా మీరు ఆందోళన చెందొద్దు. నిలిచిపోయిన పనులన్నీ మళ్లీ మొదలవుతాయి. అన్ని సమస్యలు తొలగుతాయి. జైల్లో కూడా యాక్షన్ మోడ్లోనే ఉన్నాను" అని కేజీవాల్ వ్యాఖ్యానించారు.

### ఢిల్లీ అసెంబ్లీలో కొత్త సీటింగ్ ప్లాన్..

ఢిల్లీ అసెంబ్లీ సీటింగ్ మారింది. నూతన ముఖ్యమంత్రి ఆతిశీకి మొదటి సీటు కేటాయించారు. గతంలో ఆ నంబర్ 19గా ఉండేది. ఇంతకాలం తొలిసీటులో కూర్చున్న ఆయనకు 41వ సీటు కేటాయించారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యే సీట్ల స్థానాలు కూడా మారాయి. ఇదిలా ఉంటే.. ఆతిశీ సీఎం పదవిని చేపట్టినా కేజ్రీవాల్ కోసం పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, తాను వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. "నాకు ప్రస్తుతం భరతుడికి ఎదురైన పరిస్థితే ఉంది. రాముడు వనవాసానికి వెళ్లినప్పుడు.. భరతుడు పాలించాల్సి వచ్చింది. సింహాసనంపై రాముడి పాదుకలు ఉంచి రాజ్యాన్ని ఏలాడు. ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాలే. నాలుగు నెలల తర్వాత జరిగే ఎన్నికల్లో ఢిల్లీలో మళ్లీ ఆయన అధికారాన్ని చేపడతారని విశ్వసిస్తున్నా. ఆయన తిరిగివచ్చేవరకు ఈ కుర్చీ ఇక్కడే ఉంటుంది" అని ఆతిశీ అన్నారు.

## ముంబయి నటి కేసు.. తప్పు చేసిన ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదు: హోంమంత్రి అనిత

### ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్లను సస్పెండ్ చేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్లను సస్పెండ్ చేసినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. తప్పు చేసిన ఎవర్నీ వదిలే ప్రసక్తే లేదన్నారు. కేసులో కొంత మంది పోలీసులను విచారిస్తున్నామని తెలిపారు. విచారణలో బాధ్యులని తేలితే చర్యలుంటాయని చెప్పారు. కేసును సీఎం చంద్రబాబు చాలా సీరియస్గా తీసుకున్నారని అనిత పేర్కొన్నారు.



## కుళ్లు రాజకీయాలు చేస్తే.. ప్రజలు కుళ్లబొడిచేస్తారు జాగ్రత్త: మంత్రి కొల్లు రవీంద్ర

### కుళ్లు రాజకీయాలు చేస్తే.. ప్రజలు కుళ్లబొడిచేస్తారు జాగ్రత్త అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: కుళ్లు రాజకీయాలు చేస్తే.. ప్రజలు కుళ్లబొడిచేస్తారు జాగ్రత్త అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. కలుగుల్లోంచి బయటకొచ్చిన వైకాపా నేతలు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. పేర్ని నాని, కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ చేసినోళ్లను వదిలిపెట్టబోమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా మొత్తం నీట మునిగితే వైకాపా నేతలంతా ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. జిల్లా ప్రజల బాగోగుల కోసం తాపత్రయ పడిన చంద్రబాబుపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పిచ్చివాగుడు కట్టిపెట్టి ప్రజా సమస్యలపై చర్చకు రావాలని కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు.


## ఈటీవీ బ్యూరో చీఫ్ ఆదినారాయణ మృతి బాధాకరం..: సీఎంలు చంద్రబాబు, రేవంత్

### సీనియర్ జర్నలిస్ట్, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ మృతిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.





హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: సీనియర్ జర్నలిస్ట్, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ మృతిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. ఆదినారాయణ అకాల మరణం దిగ్భ్రాంతి కలిగించిందని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదినారాయణ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదినారాయణ మృతిపట్ల ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కష్టపడి పనిచేశారన్నారు. నిజాయతీపరుడైన జర్నలిస్టు సమాజంలో మార్పునకు ఎల్లప్పుడూ కృషి చేశారని కొనియాడారు. ఆదినారాయణ కుటుంబసభ్యులకు చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



### ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కల్యాణ్

ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో అనుభవం కలిగిన జర్నలిస్ట్ ఆదినారాయణ మరణం బాధాకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈటీవీ తెలంగాణ బ్యూరో చీఫ్ బాధ్యతల్లో ఉన్న ఆయనకు వర్తమాన రాజకీయాలు, ప్రజాసమస్యలపై ఎంతో అవగాహన ఉందని కొనియాడారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన కోలుకుంటారని ఆశించానని.. ఇంతలో మరణవార్త వినాల్సి వచ్చిందన్నారు. ఆదినారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదినారాయణ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బాధాతప్త హృదయంతో ఆయనకు నివాళు లర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. "రెండున్నర దశాబ్దాలుగా ఈటీవీలో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నిబద్ధత గల జర్నలిస్టు కోల్పోయాం. ఆదినారాయణ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు.

### ఆదినారాయణ మృతికి డబ్ల్యూజేఐ సంతాపం

ఈటీవీ తెలంగాణ బ్యూరో చీఫ్ ఆదినారాయణ హఠాన్మరణం అత్యంత బాధాకరమని, పాతికేళ్లుగా నిబద్ధతతో పాత్రికేయుడిగా ఆయన అందించిన సేవలు చాలా గొప్పవని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) సంతాపం ప్రకటించింది. ఆది నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ కోరారు. గురువారం ఉదయం అపార్టుమెంట్పై వాకింగ్ చేస్తుండగా ఆదినారాయణ ప్రమాదవశాత్తు జారిపడ్డారు. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆదినారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు 25 ఏళ్లుగా ఈటీవీలో ఆయన పనిచేస్తున్నారు.

## సిరిసిల్ల నేతలన్న తరపున పోరాటానికి సిద్ధం: కేటీఆర్

### భారాస హయాంలో సిరిసిల్ల నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

సిరిసిల్ల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: భారాస హయాంలో నేతలన్నను కాపాడుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిరిసిల్ల నేతలన్నకు రూ.3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, ఉపాధి కల్పనతో నేతన్నల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. "ప్రజలకు కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక అందజేశాం. నేతన్నలతో చీరలు నేయించి పంపిణీ చేశాం. సిరిసిల్లను మరో తిరుప్పూరు చేయడానికి కృషి చేశాం. కాంగ్రెస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిపివేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దానిపై విచారణ చేయాలని అసెంబ్లీ సాక్షిగా చెప్పాం. సిరిసిల్ల నేతన్నల తరపున పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. మా పోరాటానికి నేతన్నలు కూడా సహకరించాలి" అని కోరారు.



## చంద్రబాబు ఇంటిపై దాడి కేసు.. పోలీసు విచారణకు హాజరైన వైకాపా నేతలు

### చంద్రబాబు ఇంటి పై దాడి కేసులో పోలీసుల విచారణకు వైకాపా నేతలు హాజరయ్యారు.

మంగళగిరి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో పోలీసుల విచారణకు వైకాపా నేతలు హాజరయ్యారు. మొత్తం 10 మంది నిందితులు అక్కడికి వచ్చారు. మంగళగిరిలోని డీఎస్పీ కార్యాలయంలో విచారణ సాగుతోంది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు వైకాపా నేతలు పాస్పోర్టులు సరెండర్ చేయనున్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# పర్యటక రంగాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది :మంత్రి దుర్గేశ

పర్యటక రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి దుర్గేశ్ విమర్శించారు. ఈ రంగానికి రెండేళ్లలో పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.



నెల్లూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: పర్యటక రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి దుర్గేశ్ విమర్శించారు. ఈ రంగానికి రెండేళ్లలో పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. 27న ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా విజయవాడలో సమావేశం ఏర్పాటుచేశామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 38 విభాగాల్లో అవార్డులు కూడా ఇవ్వబోతున్నామన్నారు. పర్యటక రంగం అభివృద్ధికి ప్రణాళికను తయారుచేసినట్లు పేర్కొన్నారు. బీచ్ రిసార్ట్స్, ఫెస్టివల్ రిసార్ట్స్, నగరవనాలు అభివృద్ధి చేస్తామని చెపా-ఁరు.

### కాకుటూరు నగరవనాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతాం: సోమిరెడ్డి

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి కందుల దుర్గేశ్ వెళ్లారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. సర్వేపల్లి కోడూరులోని బీచ్ను అభివృద్ధి చేయాలని మంత్రి దుర్గేశ్ను కోరామన్నారు. గత ఐదేళ్లుగా పర్యటక ప్రాంతాలను ప్రైవేటు వ్యక్తులు సర్వనాశనం చేశారని విమర్శించారు. జిల్లాకు మంజూరైన 6 నగర వనాల అభివృద్ధి కోసం మంత్రికి ప్రతిపాదించినట్లు చెపా-ఁరు. కాకుటూరు నగరవనాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టే బాధ్యత తనదేనని తెలిపారు.

# ప్రాయశ్చిత్తం కోసమే తిరుమలకు జగన్ :ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, జగన్ తిరుమల వెళ్లడం రెచ్చగొట్టే కార్యక్రమమేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతు నెహ్రూ అన్నారు.



జగ్గంపేట, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, జగన్ తిరుమల వెళ్లడం విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమమేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సంప్రదాయాలు పాటించలేదని విమర్శించారు. ప్రాయశ్చిత్తం కోసమే ఆయన తిరుమలకు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. రెచ్చగొట్టేలా వైకాపా ఎమ్మెల్యేల తిరుపతి యాత్ర ఉందని మండిపడ్డారు. మత సామరస్యం దెబ్బతీసేందుకు ప్రణాళిక ప్రకారం కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నియమాలు, నిబంధనలు పాటించి జగన్ తిరుమలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

# దుబ్బాకలో వేదికపైకి కాంగ్రెస్ నేత.. ఉండొద్దని పట్టుబట్టిన ఎమ్మెల్యే

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, భాజపా ఎంపీ రఘునందన్‌రావు. భారాస ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.



దుబ్బాక, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, భాజపా ఎంపీ రఘునందన్‌రావు, భారాస ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రితో పాటు శ్రీనివాస్‌రెడ్డి వేదికపైకి వెళ్లారు. ఆయన వేదికపై ఉండొద్దని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ పాటించాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్, భారాస కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. రసాభాస మధ్యే మంత్రి కొండా సురేఖ చెక్కులను పంపిణీ చేశారు.

# వాసుదేవరెడ్డి కార్యాలయంలో ముగిసిన సోదాలు.. కీలక పత్రాలు స్వాధీనం

ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయంలో సీఐడీ సోదాలు ముగిశాయి.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయంలో సీఐడీ సోదాలు ముగిశాయి. మూడు రోజుల పాటు కొనసాగిన తనిఖీల్లో సీఐడీ అధికారులు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని మద్యం కంపెనీలకే అధికంగా కొనుగోలు ఆర్డర్లు ఇచ్చినట్టు గుర్తించారు. గత ప్రభుత్వంలో మద్యం బాటిల్ బేసిక్ ధరను పెంచి కొందరు పెద్దలు అనుచిత లబ్ధి పొందారని దర్యాప్తులో తేలింది. మద్యం లావాదేవీలకు సంబంధించిన పత్రాలను ఫైనాన్షియల్ ఆడిటింగ్కు పంపి విశ్లేషించే యోచనలో సీఐడీ అధికారులు ఉన్నారు. బినామీ మద్యం కంపెనీలపై ఇప్పటికే సీఐడీ కేసు నమోదు చేసింది.



# రెడ్ బుక్ పని ప్రారంభమైంది.. తప్పుచేసిన వారిని వదలం: మంత్రి లోకేశ

శ్రీకాకుళం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: "మాజీ సీఎం జగన్ దేవుడి జోలికి వెళ్తే ఏమైందో గత ఎన్నికల్లో మీరంతా చూశారు. మనం ఏమతానికి చెందిన వారమైనా అన్నిమతాలను గౌరవించాలి. మేం చర్చి, మసీదులకు వెళ్లినపుడు వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటాం. తిరుమల వెళ్తానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుంది" అని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శ్రీకాకుళంలో పాఠశాల ఆకస్మిక పరిశీలన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "తిరుమల లడ్డూ నాణ్యతాలోపంతోపాటు అనేక సమస్యలను భక్తులు యువగళం పాదయాత్రలో నా దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చాక.. తితిదేను ప్రక్షాళన చేయాలని ఈఓకు చెప్పాం. నెయ్యి సరఫరా చేసే కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవీ సుబ్బారెడ్డి రూ.150కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు? తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ నాణ్యత బాగుందని వైకాపా ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు" అని లోకేశ్ తెలిపారు.

## జగన్ మాదిరి మేం పారిపోయే వ్యక్తులం కాదు

సూపర్ సిక్స్ పథకాల అమలుపై విలేకరుల ప్రశ్నలకు లోకేష్ సమాధానమిచ్చారు. "జగన్ లా మేం పారిపోయే వ్యక్తులం, కాదు. ఇప్పటికే పింఛన్లు, మెగా డిఎస్సీ హామీలను అమలు చేశాం. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. పథకాల అమలుపై మాకు చిత్తశుద్ధి ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. జగన్ లా పరదాలు కట్టుకుని మేం తిరగడంలేదు. తప్పు చేయకపోతే ఎందుకు భయపడ్డారు? ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల మధ్య ప్రజావేదిక నిర్వహిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ను ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. ప్రైవేటీకరణ లేదని నేను, మా ఎమ్మెల్యేలందరం నిన్న స్పష్టంచేశాం. విశాఖ ఉక్కును బతికించడం కోసం నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి.. కేంద్రాన్ని కోరారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. వైకాపా నాయకులు ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇటీవల వరదలు సంభవించిన సమయంలో కష్టకాలంలో ఉన్న ప్రజలకు మేం అండగా నిలబడ్డాం. జగన్.. ప్రజాధనంతో రెండు బుల్లెట్ ప్రూఫ్ కార్లు కొనుక్కున్నారు కానీ, ఏ నాడు జనం ముందుకు వెళ్లడం లేదు. ఎవరు అసలైన ప్రజానాయకులో రాష్ట్రప్రజలకు అర్థమైంది" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.



## రెడ్ బుక్ పని ఇప్పటికే ప్రారంభమైంది..

గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారు. వారి హయాంలో ఆయా వర్సిటీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు. రెడ్ బుక్పై వస్తున్న విమర్శలకు మంత్రి సమాధానమిస్తూ.. ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. "ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెడ్ బుక్ అమలు ప్రారంభమైంది. చట్టాన్ని అతిక్రమించి తప్పు చేసిన వారిని వదిలేది లేదు. ఇందులో భాగంగా ఐపీఎస్ లు కూడా సస్పెండ్ అయ్యారు. రైట్ ప్లేస్ లో రైట్ పర్సన్ ఉండాలన్నదే మా ప్రభుత్వ అభిమతం" అని తెలిపారు.

# డీజే శబ్దాలు కట్టడి చేయాల్సిందే.. రాజకీయ పార్టీల నేతలతో సీపీ సమావేశం

డీజేల విషయంలో త్వరలో గైడ్‌లైన్స్ జారీ చేస్తామని డీజీపీ జితేందర్ ప్రకటించిన నేపథ్యంలో ఆ దిశగా పోలీసు ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రారంభించారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: డీజేల విషయంలో త్వరలో గైడ్‌లైన్స్ జారీ చేస్తామని డీజీపీ జితేందర్ ప్రకటించిన నేపథ్యంలో ఆ దిశగా పోలీసు ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ర్యాలీల్లో డీజే, టపాసుల వాడకంపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. "డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. నివాసాల్లో వయసుమీరిన వారు ఇబ్బంది పడుతున్నారు. డీజే శబ్దాలు శృతి మించడంతో గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారు. గణేష్ నిమజ్జనమే కాదు మిలాద్ ఉన్ నబీలో విపరీతంగా డీజే నృత్యాలు చేశారు. పబ్లో డ్యాన్సు చేసినట్టే ర్యాలీల్లో చేస్తున్నారు. డీజే శబ్దాలు కట్టడి చేయాలని అనేక సంఘాలు వినతులు ఇచ్చాయి. అందుకే వివిధ వర్గాలను పిలిచి సమావేశం ఏర్పాటు చేశాం. అందరి అభిప్రాయం తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తాం. ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. డీజే శబ్దాలు కంట్రోల్ చేయకపోతే ఆరోగ్యాలు దెబ్బతింటాయి" అని సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ వైద్య విద్యార్థి మృతి.. ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

చికిత్స పొందుతూ వైద్య విద్యార్థి మృతి చెందిన ఘటన హైదరాబాద్ కేపీ హెచ్బీలో చోటు చేసుకుంది.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: చికిత్స పొందుతూ వైద్య విద్యార్థి మృతి చెందిన ఘటన హైదరాబాద్ కేపీహెచ్బీలో చోటు చేసుకుంది. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న వరుణ్ తేజ్ (23) కడుపులో మంటగా ఉందని కేపీహెచ్బీ రోడ్ నెం.1లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు.. అపెండిసైటిస్ గా గుర్తించారు. గురువారం ఉదయం శస్త్ర చికిత్స చేస్తుండగానే వరుణ్ తేజ్ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయాడని ఆరోపిస్తూ అతని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆసుపత్రికి వద్దకు చేరుకుని పరిస్థితి అదుపు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

# హాస్టల్లో 21 మందిపై అరాచకం.. వార్డెన్కు మరణ శిక్ష!

దాదాపు 21 మంది విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో హాస్టల్ వార్డెన్కు మరణ శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది.



గువాహటి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: అరుణాచల్ ప్రదేశ్లో కొన్నాళ్లక్రితం వెలుగు చూసిన అత్యాచార కేసులో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. దాదాపు 21 మంది విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో హాస్టల్ వార్డెన్కు మరణ శిక్ష విధించింది. ఇదేకేసులో మాజీ ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో టీచర్కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. అరుణాచలప్రదేశ్లోని ఓ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో లైంగిక దాడుల వ్యవహారం 2022లో వెలుగు చూసింది. తన 12 ఏళ్ల కవల కూమార్తెలను హాస్టల్ వార్డెన్ లైంగికంగా వేధిస్తున్నాడని ఓ తండ్రి ఫిర్యాదు చేశారు. మరికొందరు బాధితులు కూడా ఇటువంటి ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. దాంతో వార్డెన్ అరాచకాలు బయటపడ్డాయి. 2014-22 మధ్యకాలంలో 21 మంది మైనర్లపై అతడు లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడినట్లు వెల్లడైంది. బాధితుల్లో ఆరుగురు బాలురు (ఆరేళ్ల నుంచి 14ఏళ్ల వయసున్న) కూడా ఉన్నట్లు తేలింది. ఈ కేసుకు సంబంధించి గతేడాది జులైలో దాఖలు చేసిన ఛార్జిషీట్లో కీలక విషయాలు వెల్లడయ్యాయి. లైంగిక దాడికి పాల్పడేముందు బాధితులకు వార్డెన్ మత్తుమందు ఇచ్చేవాడు. ఈ విషయాలు బయటకు చెప్పకూడదని బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఆరుగురు బాధితులు ఆత్మహత్యకు కూడా ప్రయత్నించారని తేలింది. వార్డెన్ ఆగడాల గురించి ఓ మహిళా టీచర్కు బాధిత చిన్నారులు చెప్పినప్పటికీ.. పై అధికారుల దృష్టికి ఆమె తీసుకెళ్లలేదని దర్యాప్తులో వెల్లడైంది. విచారణ జరిపిన పోక్సో న్యాయ-స్థానం వార్డెన్కు మరణశిక్ష విధించగా.. మాజీ ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో మహిళా టీచర్కు 20 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది.

# కుమార్తె ఆత్మహత్య.. వియ్యంకుడిని నరికి చంపిన తండ్రి

నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మోపాల్ మండలం కంజరలో వియ్యంకుడు దారుణహత్యకు గురయ్యాడు.

మోపాల్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 26: నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మోపాల్ మండలం కంజరలో వియ్యంకుడు దారుణహత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవర్ధన్ అనే యువకుడు భవితను పెళ్లిచేసుకున్నాడు. ఇటీవల ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. భవిత మృతికి గోవర్ధనే కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో భవిత అత్తవారింటిపై దాడికి ఆమె తండ్రి సత్యనారాయణ వెళ్లారు. గోవర్ధన్ ఇంట్లో లేకపోవడంతో అతడి తండ్రి నరహరిని కత్తులతో నరికి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసుల ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

# తొందరెందుకూ నారాయణా...

## మరమ్మత్తులు చేస్తున్న భవనంలో విద్యాబోధన

- భవనం పూర్తి కాకుండానే విద్యా సంవత్సరం ప్రారంభం
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నారాయణ
- విద్యాసంస్థలు తనిఖీలు మరిచిన విద్యాశాఖ

అధికార పార్టీ అండదండ ఉంటే చాలు ఏమి చేసిన అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తారని మరోసారి జిల్లాలో నిరూపితమయ్యింది. రాష్ట్రంలో ఇప్పటికే ఇరుకు గదులలో విద్యార్థులను కుక్కుతూ లక్షల రూపాయల అక్రమ ఫీజులను వసూలు చేస్తూ ర్యాంకుల వేటలో నిబంధనలను తుంగలో తొక్కుతారని నారాయణ విద్యాసంస్థలకు అపవాదు ఉంది.





నారాయణ పాఠశాలలో మరమ్మత్తులు చేస్తున్న చిత్రాలు






నంద్యాల అర్బన్, సెప్టెంబర్ 26 (రిపబ్లిక్ న్యూస్) రవికుమార్

దీనికి ఉదాహరణగా పట్టణంలో సాయిబాబానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంను నారాయణ విద్యాసంస్థలు లీజుకు తీసుకున్నాయి. కానీ ఈ భవన నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు కూడా నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం ఓపిక పట్టలేకపోయింది. తొందరగా విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందున్న ఆదుర్దాలో విద్యార్థుల ప్రాణాలను గాలికి వదిలేసింది. ఈ భవనంలో నర్సరీ నుండి 8వ తరగతి వరకు నారాణ విద్యాసంస్థలు తరగతులను నిర్వహిస్తున్నాయి.. దాదాపుగా 1500 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరవుతున్నారు. కానీ ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు కొనసాగుతునే ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యి ఇప్పటికే సుమారు 4 నెలలు కావస్తున్న ఇంకా నిర్మాణ పనులు పూర్తి కాలేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తనిఖీలు చేసి అనువతులు ఇవ్వాల్సిన అధికారులు ఎలా తనిఖీలు చేసి అనుమతులు ఇచ్చారో ఆ దేవుడికే ఎరుక. కనీసం విద్యా సంవత్సరం ప్రారంభం అయిన తర్వాత కూడా కనీసం విద్యాశాఖ అధికారులు తనిఖీలు మరిచారు. ఈ నిర్మాణ పనులు జరిగేటప్పుడు విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరిగిన ఎవరు బాధ్యత వహిస్తారు. ప్రముఖ విద్యాసంస్థ సంకల్ప్ పాఠశాల రేకుల షెడ్ కూలిపోయి విద్యార్థులు తీవ్రంగా గాయపడిన ఇప్పటికి అధికారులు కళ్ళు తెరిచి ఇటువంటి సంఘటనలు పునారావృతం కాకుండా కనీసం తనిఖీలు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1820: బెంగాలీ కవి, విద్యావేత్త, తత్త్వవేత్త, పారిశ్రామిక వేత్త, రచయిత, అనువాదకుడు, సమాజ సేవకుడు ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ జననం (మ1891).
- 1867: తెలుగు రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జననం (మ. 1946).
- 1886: భారతదేశంలో బ్రిటిషు ఐ.సి.ఎస్. అధికారి, స్వాతంత్ర్యానికి పూర్వపు బీహారు రాష్ట్ర గవర్నరు థామస్ జార్జ్ రూథర్‌ఫర్డు జననం (మ. 1957).
- 1895: భారత యోగీశ్వరుడు, మహావతార్ బాబాజీ కి శిష్యుడు లాహిరి మహాశయులు మరణం (జ. 1828).
- 1907: స్వాతంత్ర్య సమరయోధుడు, చరిత్రకారుడు, చలనచిత్ర దర్శకుడు ఆమంచర్ల గోపాలరావు జననం (మ. 1969).
- 1943: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తరఫున ఆడిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు ఇయాన్ చాపెల్ జననం.
- 1960: వెస్టిండీస్ కు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు, క్రికెట్ శిక్షకుడు గస్ లోగీ జననం.
- 1999: అనేక ప్రపంచ ఆర్థిక సంక్షోభాలకు ప్రతిస్పందనగా జీ20 స్థాపించబడింది.



లక్ష్మీనరసింహం



ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్



లాహిరి మహాశయులు



ఇయాన్ చాపెల్

## రిపబ్లిక్ సినిమా



### మహేష్, జక్కన్న భారీ ప్రాజెక్ట్ పై ఇంట్రెస్టింగ్ బజ్.!

ప్రస్తుతం మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా దర్శక దిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళి కాంబినేషన్ లో భారీ చిత్రాన్ని చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం మహేష్ కెరీర్ లో 29వ సినిమాగా రాబోతుంది. మరి రాజమౌళితో ఎప్పుడు నుంచో అనుకుంటున్న ఈ చిత్రం ఎట్టకేలకి సెట్ అయ్యి పాన్ వరల్డ్ లెవెల్ హైప్ ని సెట్ చేసుకుంది. అయితే ఈ సినిమా ఇంకా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది అనేది మాత్రం అభిమానులకి క్లారిటీ లేదు. ఇంకో పక్క మహేష్ బాబు సరికొత్త మేకోవర్ అయితే ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇస్తుంది. అయితే ఈ సినిమా విషయంలో ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తోంది. దీని ప్రకారం ఈ ప్రాజెక్ట్ నటీ నటుల ఎంపిక ఏంటి అనేది దాదాపు క్లియర్ అయ్యిపోయిందట. మహేష్ సహా సినిమాలో కనిపించే నటీనటుల లిస్ట్ ని జక్కన్న ఫైనల్ చేసేసారట. ఇలా ప్రతి అంశంలో రాజమౌళి అయితే పక్కా క్లారిటీగా సినిమా పనులు చేసేస్తున్నట్టుగా తెలుస్తుంది. మరి ఈ సినిమాలో వరల్డ్ వైడ్ గా చాలా మంది ప్రముఖుల పేర్లే వినిపిస్తున్నాయి. మారిలో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాల్సిందే.



## రిపబ్లిక్ స్పోర్ట్స్

### స్వదేశానికి ధోనీ.. రిటెన్షన్ పై తొలగని సస్పెన్స్..!

**2025 ఐపీఎల్ సీజన్లో ధోనీ ఆడతాడా లేదా అన్న అంశంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. తాజా మహి అమెరికా పర్యటన ముగించుకొని రావడంతో.. ఈ వ్యవహారం కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు.**




టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంస్ ధోనీ ఐపీఎల్ షెడ్యూల్పై ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం వెలువడలేదు. దీంతో 2025 మెగా టోర్నీలో మహి ఆడతాడా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అతడిని రిటైన్ చేసుకొంటామని సీఎస్కే జట్టు హామీ ఇచ్చినట్లు పలు మీడియా సంస్థలు కథనాలు వెలువరించాయి. కానీ, అతడు అందుకు సానుకూలంగా ఉన్నాడా అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. “మాకు అతడి నుంచి ఇంకా సమాచారం అందాల్సి ఉంది. ఒక్కసారి బీసీసీఐ అధికారికంగా రిటెన్షన్పై నిర్ణయం తీసుకొంటే.. మాకు స్పష్టత వస్తుంది” అని సీఎస్కే వర్గాలు వెల్లడించినట్లు ఓ ఆంగ్ల పత్రిక కథనంలో పేర్కొంది. ఈ ఏడాది చివరి నాటికి ఐపీఎల్ 2025 మెగావేలాన్ని నిర్వహించవచ్చన్న అంచనాలున్నాయి. ఈ మొత్తంలో అత్యంత కీలకమైనది రిటెన్షన్ల ప్రక్రియే. ఈ సారి బీసీసీఐ కేవలం ఐదుగురు ఆటగాళ్లను రిటెన్షన్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుందని ప్రచారం జరుగుతోంది. ధోనీ ఇప్పటి వరకు సీఎస్కే తరఫున 2024లో మొత్తం 14 లీగ్ మ్యాచ్లో పాల్గొన్నాడు. గాయం బాధను అదిమిపట్టి మరీ అతడు జట్టుకోసం బరిలోకి దిగాడు. అతడు బ్యాటింగ్ ఆర్డర్లో చివరి మైదానంలోకి దిగి.. పూర్తిగా హిట్టింగ్పైనే దృష్టిపెట్టాడు. మొత్తం 73 బంతులను ఎదుర్కొని 220 స్ట్రైక్రేట్తో 161 పరుగులు చేశాడు. ఈ సారి సీఎస్కే లీగ్ దశలోనే బయటకు వెళ్లిపోవడంతో 43 ఏళ్ల మహి భవిష్యత్తుపై సందేహాలు మొదలయ్యాయి. మరోవైపు కెప్టెన్సీ కూడా రుతురాజ్ చేపట్టిన విషయం తెలిసిందే.

### భారత్‌కు చేరుకొన్న ధోనీ..

ధోనీ అమెరికాలో మిత్రులతో కలిసి వెకేషన్ పూర్తి చేసుకొని భారత్‌కు తిరిగి వచ్చాడు. అతడు రాంచీ ఎయిర్ పోర్టుకు చేరుకొన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహి అమెరికాలో ఇటీవల ఓ ఫుట్బాల్ మ్యాచ్కు హాజరయ్యాడు.

## ఆరోగ్యం

### ఉదయాన్నే వేడి నీరు తాగుతున్నారా.. ఈ సమస్యలొస్తాయి జాగ్రత్త

వేడి నీరు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే, పరగడపున తాగడం వల్ల ఉపయోగాలు ఉన్నాయా, నష్టాలున్నాయా తెలుసుకోండి. వేడినీరు తాగితే బరువు తగ్గడంతో పాటు చాలా లాభాలు ఉన్నాయని చెబుతారు. దీంతో చాలా మంది ఉదయం లేవగానే వేడి నీరు తాగుతారు. ఇలా ఖాళీకడుపుతోనే వేడినీరు తాగడం వల్ల కొన్ని సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఆ సమస్యలు ఏంటో తెలుసుకోండి.



#### దంత సమస్యలు..

రెగ్యులర్‌గా వేడి నీరు తాగితే దంత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువగా వేడి నీరు తీసుకోవడం వల్ల మీ టేస్ట్ బడ్స్ కూడా దెబ్బతింటాయి. దీంతో మనం కాసేపటి వరకూ ఏం తిన్నా వాటి టేస్ట్ తెలియదు.




#### డీహైడ్రేషన్..

వేడినీటిని తాగితే బాడీలో డీహైడ్రేషన్ పెరుగుతుంది. అదే విధంగా, బాడీ కొన్ని పోషకాలు, ఖనిజాలను అబ్జార్బ్ చేయడంలో ఎఫెక్ట్ అవుతుందని కొంతమంది చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని మందులు పనిచేయవని చెబుతున్నారు. కాబట్టి, జాగ్రత్త.



#### గొంతు మంట..

వేడిగా ఉన్న నీటిని పరగడపున తాగితే గొంతు మంటగా ఉంటుంది. రోజంతా ఆ మంట కంటిన్యూ అవుతుంది కొన్నిసార్లు. అందుకే, వేడి నీటిని ఉదయాన్నే తాగడం అంత మంచిది కాదు.





#### జీర్ణ సమస్యలు..

ఖాళీ కడుపుతో వేడి నీటిని తాగితే అది జీర్ణ వ్యవస్థపై ఎఫెక్ట్ పడుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు యాసిడ్ రిఫ్లక్స్, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి, పరగడపున తాగొద్దు.



#### ఏం చేయాలి..

మరి వేడి నీరు కాకుండా కొద్దిగా గోరువెచ్చని నీరు తాగొచ్చు. దీనికోసం ముందుగా ఓ సిప్ చేసి నీటి వేడిని తెలుసుకోవచ్చు. దీని వల్ల ఎలాంటి సమస్యలు రావు. గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.